క్లుప్తంగా

30 నుంచి సామాజిక తనిఖీలపై గ్రామ సభలు

సి.బెళగల్: మండలంలో ఉపాధి హామీ పనులపై గ్రామాలలో చేపట్టిన సామాజిక తనిఖీలలో భాగంగా ఈనెల 30వ తేదీ నుంచి గ్రామ సభలను నిర్వహించడం జరుగుతుందని ఎస్సార్పీ మల్లికార్జున తెలిపారు. ఏప్రిల్ ఒకటవ తేది 2022 నుంచి మార్చి 31వ తేది 2023 ఆర్థిక సంవత్సరం వరకు జరిగిన పనులపై ఇప్పటికే సిబ్బంది తనిఖీలను చేపట్టారన్నారు. ఈ నెల 30వ తేదీ కొండాపురం, బురాన్‌దొడ్డి, గుండ్రేవుల, అక్టోబర్ ఒకటవ తేదీ సంగాల, బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, ముడుమాల, ఇనగండ్లలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా అక్టోబర్ 3న కొత్తకోట, ఈర్లదిన్నె, గొల్లలదొడ్డి, 4న కంబదహాల్, పలుకుదొడ్డి, సి.బెళగల్, చింతమానుపల్లె, పోలకల్ గ్రామాలలోని సచివాలయాలలో గ్రామ సభలు ఉంటాయన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి ఎమ్మెల్యే సంతాపం



వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగర శివారులోని మాసమసీదులో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటనారాయణరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ గురువారం మాసమసీదులోని వెంకటనారాయణరెడ్డి పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ గిప్సన్, జెడ్పీటీసీ గిరిజోన్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలు సాధిస్తాం



భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాణ్యం: భగత్‌సింగ్ ఆశయాలను సాధించేందుకు అందరు కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బత్తిని ప్రతాప్ పిలుపునిచ్చారు. గురువారం సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో భగత్‌సింగ్ 166 జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశం కోసం చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన అమవీరుడు భగత్‌సింగ్ అన్నారు.

కడప సభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న గద్దల సామేల్

పాణ్యం: ఎస్సీ వర్గీకరణ కోసం శుక్రవారం కడపలో నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు గద్దల సామేల్ కోరారు. గురువారం పాణ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలతోపాటు ఉప కులాలకు న్యాయం చేయాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ పిలుపు మేరకు కడపలో నిర్వహించే సభకు మాదిగలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ బాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గడివేముల: మండల కేంద్రం గడివేముల గ్రామానికి చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. పెసల మహేష్ (20) కొన్ని రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడేవాడు. ఈ నెల 26న అధికంగా కడుపు నొప్పి రావడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందును తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతుడి తల్లి పెసల భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కల్లూరు : ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తడకనపల్లె గ్రామానికి చెందిన షేక్ రియాజ్, షేక్ హుసేన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయ్యింది. ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు తడకనపల్లె గ్రామానికి చెందిన మహిళపై షేక్ రియాజ్ ఈనెల 23వ తేదీన రాత్రి సమయంలో అత్యాచారానికి ప్రయత్నించాడు. అయితే మహిళ గట్టిగా కేకలు వేయడంతో పారిపోయాడు. గురువారం బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు షేక్ రియాజ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు అత్యాచారం కేసు, షేక్ హుసేన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు బెదిరింపు చట్టం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రబీ సాగుకు సన్నద్ధం!

- ముందస్తుగా సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధం
- వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీబిజీ
- పెరగనున్న సాగు విస్తీర్ణం



రబీకై పంటలు సాగు చేసేందుకు పొలాన్ని ట్రాక్టర్‌తో సిద్ధం చేస్తున్న రైతన్న

కోడుమూరు రూరల్ : రబీ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో చాలామంది రైతులు పంటలను సాగు చేయలేదు. సాగు చేసిన పంటలు సైతం వానల్లేక మొలకదశలోనే ఎండిపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం వర్షాలు పడితే రబీ కింద శనగ పంటను సాగు చేసేందుకు మండలంలో రైతులు సమాయత్తమవుతున్నారు.

ఈ మేరకు వ్యవపసాయ పనుల్లో అన్నదాతలు బిజీ అయ్యారు. మండలంలో ఈ ఏడాది శనగ సాగు విస్తీర్ణం భారీగా పెరిగే అవకాశముందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతియేటా 8వేల ఎకరాల నుంచి 9వేల వరకు సాధారణ సాగు విస్తీర్ణం ఉంటుంది. అయితే ఈఏడాది 12వేల ఎకరాలకు పైగా రైతులు రబీ కింద పంటలు సాగు చేసే అవకాశం ఉందంటున్నారు వ్యవసాయ అధికారులు.

ముందుగానే శనగ విత్తనాలు పంపిణీకి చర్యలు

రైతుల అవసరాల మేరకు గత ఏడాది కంటే ఈ ఏడాది సబ్సిడీ శనగ విత్తనాలను ముందుగానే రైతులకు అందజేసేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. ప్రభుత్వం రబీ సీజన్‌కు సంబంధించి మండలానికి 3,000క్వింటాళ్ల శనగ విత్తనాలను మంజూరు చేసింది. క్వింటాం పూర్తి ధర 8,100 ఉండగా 40శాతం సబ్సిడీ పోను రైతులు 4,860 చెల్లించాల్సి ఉంటుంది.

ఎకరాకు 40కిలోల శనగ విత్తనాలు

ప్రతి ఏడాది ఎకరాకు 25కిలోల ప్రకారం సబ్సిడీ శనగ విత్తనాలను అధికారులు పంపిణీ చేస్తున్నారు. అయితే ఈనెల 13వతేదీన కోడుమూరుకు విచ్చేసిన ఏపీ సీడ్స్ ఎండీ శేఖర్‌బాబును రైతులు కలిసి ఎకరాకు 40కిలోల చొప్పున శనగ విత్తనాలను ఇవ్వాలని కోరారు. స్పందించిన ఆయన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎకరాకు 40కిలోల శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల అధికారులు ఇప్పకే ప్రకటించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.



కోడుమూరు రైతుభరోసా కేంద్రంలో సబ్సిడీ శనగ విత్తనాలను పరిశీలిస్తున్న రైతులు

అదనులోనే విత్తనాలను విత్తాలి

రబీ కింద పంటలు సాగు చేసే రైతులు అరకొర వానలకు విత్తనాలను విత్తుకోకూడదు. బాగా వర్షాలు కురిసి భూములు పదునెక్కాకే విత్తనాలు వేయాలి. రైతులకు అవసరమైన సబ్సిడీ శనగ విత్తనాలు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. అవసరమైన రైతులు ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి పేర్లను నమోదు చేసుకుని శనగ విత్తనాలను పొందాలి.

– ఏఓ రవి ప్రకాష్, కోడుమూరు

3,450 క్వింటాళ్ల శనగ విత్తనాలు కేటాయింపు

- నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ

ఓర్వకల్లు: రబీ సీజన్‌కు సంబంధించి ఈ ఏడాది మండలానికి 3,450 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలను కేటాయించినట్లు ఏఓ సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణ మార్కెట్ ధర ప్రకారం క్వింటాం రూ.8100 ఉండగా ప్రభుత్వం 40 శాతం రాయితీపోనూ రైతువాటా కింద రూ.4860 చెల్లించాల్సివుందన్నారు. జీజీ–11 రకం శనగ విత్తనాలను అన్ని రైతు భరోసా కేంద్రాలలో పంపిణీకి సిద్ధంగా ఉంచామన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా రైతులకు సిబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. ఓర్వకల్లు రైతు భరోసా కేంద్రం వద్ద ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు.

కోడుమూరు రూరల్ : రబీ సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ శనగ విత్తనాలను శుక్రవారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా రైతులకు అందజేస్తున్నట్లు ఏఓ రవిప్రకాష్ గురువారం తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయ ఆవరణలో జరిగే శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులతో పాటు, రైతులు హాజరవుతారని ఆయన చెప్పారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

- జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

గడివేముల: ప్రతిఒక్కరూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు సూచించారు. గురువారం మండల కేంద్రమైన గడివేములలోని వివిధ కాలనీలను ఆయన పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న కాలనీల్లోని డ్రైనేజీల్లో క్లోరినేషన్ చేయించడంతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎంఓ మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో చెత్తచెదారం ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వ ఉన్న చోట దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు బ్లీచింగ్, వేస్ట్ అయిల్‌ను చల్లాలన్నారు. రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు జ్వరం ఉంటే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్దకే వైద్య సేవలు అందిచడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ వరప్రసాద్ రెడ్డి, ఎస్‌యూఓ వెంకటేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



గడివేములలోని డ్రైనేజీలో వేస్ట్ అయిల్‌ను పిచికారీ చేయిస్తున్న దృశ్యం

నేటి 'స్పందన' రద్దు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించాల్సిన 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎంపీడీఓ దస్తగిరి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హాజరు కావాల్సి ఉండగా అనివార్య కారణాల మూలంగా రావడం లేదని, దీంతో ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామన్నారు. తదుపరి నిర్వహించే తేదీని ప్రకటిస్తామని, ప్రజలు గమనించాలని సూచించారు.

30లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

కోడుమూరు రూరల్ : ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఫీజు చెల్లింపునకు ఈనెల 30వతేదీ వరకు గడువు ఉందని కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో కళాశాలలో చదివి ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

వైఎస్సార్ బీమా రూ.2లక్షల చెక్కు పంపిణీ



వైఎస్సార్ బీమాచెక్కును బాధిత కుటుంబానికి అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కోడుమూరు నియోజకవర్గంలోని సి బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన బోయ అల్లిస్వామి పాముకాటుతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును మృతుడి భార్య బోయ రామేశ్వరమ్మకు గురువారం కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో పోలకల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రవక్త జయంతి వేడుకలు



ర్యాలీగా వెళ్తున్న ముస్లిం సోదరులు



మహ్మద్ ప్రవక్త కేశాలను చూపుతున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని అసారేషరీఫాలో గురువారం మహ్మద్ ప్రవక్త జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రవక్త కేశాలను మహ్మద్ సాలీ అలిబేగ్ చూపించారు. ప్రవక్త చూపిన మార్గంలో నడువాలని ఈ సందర్భంగా మహ్మద్ సాలీ అలిబేగ్ సూచించారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలన్నారు. అంతకుముందు పాణ్యంలోని ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా ముస్లిం యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహకులు ముత్తవలి ఖాదర్‌బేగ్, అబ్దుల్‌బేగ్, జంషీర్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

కల్లూరు: ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఇంటింటి సర్వే చురుగ్గా సాగుతోంది. ఈ నెల 15వ తేదీ నుంచి ఉలిందకొండ, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు ఇంటింటికీ తిరుగుతూ ఆయా కుటుంబాల సభ్యుల ఆరోగ్య వివరాలపై ఆరా తీస్తున్నారు. బీపీ, మధుమేహం, గల్ల, మలేరియా, డెంగీ తదితర పరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేస్తున్నారు సిబ్బంది. అదేవిధంగా ఈ నెల 30 నుంచి అక్టోబర్ 27 వరకు గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వైద్య శిబిరంలో పాల్గొనే వ్యక్తులకు ఇళ్ల వద్దనే టోకన్లు పంపిణీ చేస్తున్నారు. వైద్య శిబిరం ద్వారా నయం కాని జబ్బులకు ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య సౌకర్యం కల్పించడం జరుగుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలపారు.

ప్రజల ఆరోగ్యానికి జగనన్న సురక్ష

గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించాలన్న దృక్పథంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు ముమ్మర చర్యలు చేపట్టింది. అందుల్లో భాగంగానే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్యుల ఆధ్వర్యంలో సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి గ్రామాలలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక రోగులను గుర్తించి వారికి టోకెన్లు అందజేస్తున్నారు. సర్వే అనంతరం గ్రామ గ్రామాన వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

రేపు ఉలిందకొండలో వైద్య శిబిరం

ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి ఉలిందకొండ సచివాలయం–1 పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నాట్లు అధికారులు పేర్కొన్నారు. సచివాలయం పరిధిలో ఇంటింటి సర్వే పూర్తి కాగా ఇప్పటి వరకు 440 మందికి ఏఎమ్ఎమ్, ఎమ్ఎల్‌హెచ్‌పీలు టోకన్లు అందించారు. వీరికి ప్రత్యేక వైద్య శిబిరంలో వైద్యనిపుణులు పరీక్షలు చేస్తారు.





చిన్నటేకూరులో వృద్ధుడికి బీపీ పరీక్ష చేస్తున్న ఏఎన్ఎం, మహిళకు రక్త పరీక్ష చేస్తున్న ఏఎన్ఎం

ఆసుపత్రిలో రోగులకు దారి చూపిస్తాం

- మాజీ ఎంపీ బుట్టా రేణుక

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వంద ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నెలకొంది. ఇందులో ఏ విభాగం ఎక్కడుందో ఇక్కడ పనిచేసే వారికి సైతం ఒక్కోసారి తక్కున స్ఫురించదు. ఇక గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగుల పరిస్థితి గురించి చెప్పనలవది కాదు. ఇలాంటి వారి కోసం తమ వంతు సహాయంగా దారి చూపిస్తామని బుట్టా ఫౌండేషన్ అధ్యక్షులు, మాజీ ఎంపీ బుట్టా రేణుక ముందుకు వచ్చారు. ఈ మేరకు గురువారం ఆమె ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డితో సమావేశమయ్యారు. ఏ విభా గం ఎక్కడుందో....ఏ జబ్బుకు ఎక్కడికి వెళ్లాలో తెలియక చాలా మంది రోగులు, వారి సహాయకులు ఇబ్బంది పడుతుంటారని డాక్టర్ వెంకటరంగారెడ్డి ఆమెకు వివరించారు. ఇలాంటి వారికి దిక్సూ చి మాదిరిగా దారి చూపిస్తే ఎంతో బాగుంటుందని సూచించారు. ఇందు కోసం స్వచ్ఛందంగా సేవ చేసే వారు ముందుకు రావాలని కోరారు. ఆ బాధ్యత తాము తీసుకుంటామని, ఎంత మంది కావాలో చెబితే సహాయకులను ఏర్పాటు చేస్తామని బుట్టా రేణుక హామీ ఇచ్చారు. బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ సేవలు నిరంతరం కొనసాగేలా చూస్తామని ఆమె చెప్పారు. దీనివల్ల రోగులు ఎక్కడికి, ఎలా వెళ్లాలో తెలియక అయోమయంలో సమయాన్ని వృథా చేసుకునే ఇబ్బంది తప్పుతుందన్నారు.



ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డిని కలిసిన బుట్టా రేణుక

గిప్సన్ చర్చిలో సాంస్కృతిక పోటీలు

కర్నూలు (టౌన్): నగరంలోని గిప్సన్ సెంట్రల్ బాప్టిస్టు చర్చిలో వచ్చే 19 నుంచి 22 వరకు నిర్వహిస్తున్న వార్షికోత్సవాల సందర్భంగా గురువారం సోలో సింగింగ్, కొరియోగ్రఫీ పోటీలు నిర్వహించారు. కొరియోగ్రఫీ విభాగంలో గిప్సన్ సెంట్రల్ చర్చి మొదటి స్థానం, గుడ్‌షప్పర్డ్ రెండవ స్థానం, బేతేలు బాప్టిస్టు చర్చి సభ్యులు మూడవ స్థానంలో నిలిచారు. సోలో సింగింగ్ విభాగంలో మధురిమ రాజీవ్ (గిప్సన్ చర్చి) మొదటి స్థానం, ఎస్తేరు రాణి (బేతేలు బాప్టిస్టు చర్చి) రెండవ స్థానం, యూత్ క్విజ్ పోటీల్లో చిప్పగిరి ఏబీఎం చర్చి మొదటి స్థానం, తంగెడంచ రెండవ స్థానం, గిప్సన్ చర్చి మూడవ స్థానం సాధించారు. కార్యక్రమంలో గిప్సన్ సెంట్రల్ చర్చి పాస్టర్ పి.కృపాదానం రాజు, చర్చి అధ్యక్షులు వినోద్ జోషిఫర్, ఉపాధ్యక్షులు దేవప్రసాద్, కోశాధికారి విక్రమ్ కుమార్, పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ ప్రశాంతి సామ్, సుగుణ సుధాకర్, సులోచన, సంపూర్ణ, అనిల్ కుమార్, దెబోర, ఐజక్, షారోన్‌లు వ్యవహరించారు. పోటీల నిర్వాహక కార్యదర్శి మధుసూదన్‌రావు మాట్లాడుతూ విజేతలకు వచ్చే నెల 19 నుంచి 22 వర కు నిర్వహిస్తున్న వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు.



కొరియోగ్రఫీ పోటీల్లో నృత్యప్రదర్శన చేస్తున్న దృశ్యం

గడప గడపకూ నిధులు

- నిధులు విడుదల చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ
- 67 అభివృద్ధి పనులకు రూ.6.37 కోట్లు విడుదల
- ఇప్పటికే రూ.8.37 కోట్లతో 151 అభివృద్ధి పనులు పూర్తి
- ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట



నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నగరం వేగంగా అభివృద్ధి చెందుతోంది. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 52 వార్డుల్లో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్‌లు 1,365 సచివాలయాల పరిధిలోని ప్రతి గడపకూ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. స్థానికుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులచే అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి పంపగా నిధులు మంజూరు చేస్తుండటంతో నగరం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది.

రూ.6.37 కోట్లు విడుదల..

నగర పరిధిలో స్థానికుల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి గుర్తించి ప్రాధాన్యత క్రమంలో 67 పనులు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ నాలుగు రోజుల క్రితం అనుమతులు మంజూరు చేశారి. నిధులు మంజూరుకు లైన్ క్లియర్ రావడంతో పనులు ప్రారంభించేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. మంజూరైన ఈ నిధుల ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాలను ఎంపిక చేసి పనులు చేపట్టనున్నారు.

ఇప్పటికే పలు చోట్ల పనులు పూర్తి

రెండేళ్లలో నగరపాలక సంస్థకు పలు దఫాలుగా గడప గడప నిధులు మంజూరు అవుతున్నాయి. ప్రతిపాదనలు పంపడం, అనుమతులు తీసుకోవడం, పనులు పూర్తి చేయడం ద్వారా నిధులు సంబంధిత కాంట్రాక్టర్ల అకౌంట్లలో జమ అవుతున్నాయి. ఇప్పటికే ఈ పథకం ద్వారా ప్రతి సచివాలయాల పరిధిలో గుర్తించిన పనులు పెద్ద ఎత్తున చేపట్టారు. ఇప్పటికే రూ.8.37 కోట్లతో నగరంలోని 52 వార్డుల పరిధిలో మురుగు కాల్వలు, కల్వర్టులు, సీసీ రోడ్లు, కంకర రోడ్లు, ప్యాచ్ వర్కులు పూర్తి చేశారు. ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన కల్లూరు కాలనీలు, విలీన గ్రామాల్లోనూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం మరో విడత నిధులు మంజూరు కావడంతో నగరంలో పెద్ద ఎత్తున్న అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

త్వరలో పనులు ప్రారంభం

గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం విడుదల చేస్తోంది. నగరంలో అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నాం. కర్నూలు, పాణ్యం, కోడుమూరు అర్బన్ ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు సూచించిన సమస్యలను పరిగణలోకి తీసుకుని అభివృద్ధి చేస్తున్నాం. ఇటీవలే మరోసారి గడప గడపకు మన ప్రభుత్వం నిధులు మంజూరు అయ్యాయి. టెండర్ ప్రక్రియ చేపట్టి అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

– షాకీర్ హుస్సేన్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

గైనిక్ హెచ్‌ఓడీగా డాక్టర్ వెంకటరమణ

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజీ విభాగాధిపతిగా డాక్టర్ ఎస్.వెంకటరమణ నియమితులయ్యారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు గైనిక్ హెచ్‌ఓడీగా ఉన్న డాక్టర్ ఎస్.మాణిక్యరావు పదోన్నతిపై అనంతపురం మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. గురువారం ఆయన రిలీవ్ కావడంతో డాక్టర్ వెంకటరమణ హెచ్‌ఓడీగా బాధ్యతలు స్వీకరించారు.

రెండు లారీలు పట్టివేత

కర్నూలు (న్యూసిటీ): అనుమతి లేకుండా డోలమైట్ పౌడర్ తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం తెల్లవారు జామున డోలమైట్ పౌడర్‌ను రెండు లారీల్లో తరలిస్తున్నారనే సమాచారం రావడంతో వెళ్లి తనిఖీ చేసి స్వాధీనం చేసుకుని, యజమానులకు రూ.1.12 లక్షల జరిమానా విధించామన్నారు. బనగానపల్లెకు చెందిన ఆనంద్ అనే వ్యక్తి మైనింగ్ అధికారులు తనిఖీ చేయడానికి ఎక్కడెక్కడికి వెళ్తున్నారనే విషయాన్ని జీపీఎస్ ద్వారా తెలుసుకొని లారీలు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నాడన్నారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేస్తున్న అతడిపై కేసు నమోదు చేస్తామని డీడీ తెలిపారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, సిబ్బంది ఉన్నారు.